సాక్షి
శ్రీకాకుళం

శనివారం । 30 । మార్చి । 2024



పది 'స్పాట్'కు వేళాయె

రేపటి నుంచి టెన్త్ స్పాట్ మొదలుకానుంది. అందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

-IIలో



పెళ్లి కబురు చెప్పడానికి..

పెళ్లి కబురు చెప్పడానికి వెళ్తూ ఓ వలంటీర్ మృతిచెందాడు. ఏప్రిల్ 20న పెళ్లి జరగాల్సి ఉంది.

-IIలో



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
శని	ఆది
సాయంత్రం	ఉదయం
6.11	4.35

న్యూస్‌రీల్

'రన్ ఫర్ జీసెస్‌లో పాలు పంచుకోండి'

కాశీబుగ్గ: రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న అన్ని జిల్లాలు, మండలాల్లో శనివారం రన్‌ఫర్ జీసస్ కార్యక్రమం నిర్వహించనున్నామని, అందరూ పాలుపంచుకోవాలని జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ ప్రెసిడెంట్ బిషప్ డీఎస్‌వీఎస్ కుమార్ కోరారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ చిన బడం క్రిష్టియన్ ప్రేయర్ టెంపుల్ నుంచి ప్రకటన విడుదల చేశారు. ఈ కార్యక్రమం ఉదయం ఆరు గంటల నుంచి ఎనిమిది గంటల వరకు జరుగుతుందని తెలిపారు.

'ఆర్టీసీని పరిరక్షించుకుందాం'



ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్న ఆర్టీసీ అధికారులు, సిబ్బంది

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీ ప్రజారవాణా సంస్థ అని, అలాంటి సంస్థను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ఆర్టీసీ అధికారులు పేర్కొన్నారు. ఆర్టీసీ ఆదాయానికి గండి కొట్టే ప్రైవేటు వాహనాలను నియంత్రించే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం శ్రీకాకుళంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమాన్ని ఆర్టీసీ అధికారులు, సిబ్బంది, సెక్యూరిటీ విభాగం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం ఒకటి, రెండు డిపోల మేనేజర్లు పి.మల్లికార్జునరాజు మాట్లాడుతూ మోటారు వెహికల్ చట్టం ప్రకారం ఆర్టీసీ కాంప్లెక్స్ పరిసర ప్రాంతాల్లో ఎలాంటి ప్రైవేటు వాహనాలు నిలుపరాదన్నారు. కాంప్లెక్స్ ఆవరణలో ప్రైవేటు వాహనాలు నిలుపుదల చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఎస్‌ఎం కె.నరేంద్ర, టీఐ-3 ఎల్ఎస్ నాయుడు, ఏడీసీ పీవీఎస్ ప్రసాద్, ఆర్టీసీ ఓపీఆర్‌ఎస్ ఎండీఏ భాషా, ఆర్టీసీ సెక్యూరిటీ విభాగం ప్రతినిధులు జోగినాయుడు, రామకృష్ణ, నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆదిత్యాలయ నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



విరాళ నగదును ఈఓ చంద్రశేఖర్‌కు అందజేస్తున్న శ్రీనుబాబు కుటుంబం

అరసవల్లి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో అమలవుతున్న నిత్యాన్నదాన పథకానికి నగరానికి చెందిన గొంటు శ్రీనుబాబు (ఎల్‌ఐసి), రేణుకాదేవి దంపతులు శుక్రవారం రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. ఈ మేరకు విరాళ నగదును ఆలయ ఈఓ ఎస్.చంద్రశేఖర్‌కు అందజేశారు. అనంతరం ఆదిత్యుడిని అంతరాలయ దర్శనం చేసుకుని దాతలు తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు ఇప్పిలి ఫణీంద్ర శర్మ తదితరులున్నారు.

నిలిచిపోయిన మద్యం లారీలు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లలోని ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ గోదాంలో ఖాళీ లేకపోవటంతో మద్యం లోడు లారీలు నిలిచిపోయాయి. పాత జాతీయ రహదారి నుంచి గోదాం వరకు రోడ్డు పక్కన పార్కింగ్ చేశారు. అన్‌లోడింగ్‌లో జాప్యం వల్ల లారీ డ్రైవర్లు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు అన్‌లోడింగ్‌కు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

96 ఒడిశా మద్యం బాటిళ్ల పట్టివేత



స్వాధీనం చేసుకున్న మద్యంతో పోలీసులు

మెళియాపుట్టి: మండలంలోని సిరియాఖండి జంక్షన్ వద్ద ఫ్లయింగ్ స్క్వాడ్ పోలీసులు 96 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ రాజేష్ తెలిపిన వివరాల మేరకు.. శుక్రవారం సాయంత్రం పాతపట్నం ఫ్లయింగ్ స్క్వాడ్ పోలీసులు తనిఖీ నిర్వహిస్తుండగా ఇద్దరు వ్యక్తులు ఆటోలో 48 బీర్ బాటిళ్లు, 48 ఎంసి (180ఎంఎల్ మెక్‌డొవెల్) బాటిళ్లను తరలిస్తూ పట్టుబడ్డారు. మెళియాపుట్టి మండలం పొగడవెల్లి గ్రామానికి చెందిన వీరు ఓ వివాహం కోసం వీటిని తీసుకెళ్తున్నట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి, ఆటో, మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.



● భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే

జిల్లావ్యాప్తంగా గుడ్‌ఫ్రైడేను క్రైస్తవులంతా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శిలువ మోసిన క్రీస్తును స్మరిస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేసుకున్నారు. వేషధారణలతో రోడ్లపై ప్రదర్శనలు నిర్వహించారు. -సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం

● ఎచ్చెర్ల కూటమిలో
అసమ్మతి కాలకూటం



- ఎన్ఈఆర్‌పై రోజురోజుకీ వెల్లువెత్తుతున్న వ్యతిరేకత
- బీసీలకు అన్యాయం చేశారంటూ మండిపడుతున్న బీజేపీ సీనియర్లు
- కులాభిమానంతో టిక్కెట్ ఇచ్చారంటూ పురంధేశ్వరిపైన మండిపాటు
- జరిగిన పరిణామాలపై వార్తలు రాస్తున్న పత్రికలపై వెళ్లగక్కుతున్న అక్కసు
- పరువు నష్టం దావా వేస్తామంటూ సోషల్ మీడియా వేదికగా బెదిరింపు



స్వపక్షంలో విపక్షం..

బీజేపీ సీనియర్ నాయకులు పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరిపైన రగిలిపోతున్నారు. రెండు దశాబ్దాలుగా పార్టీ కోసం కష్టపడిన వారిని కాకుండా కొత్తగా వచ్చిన ఎన్ఈఆర్‌ను ఎలా అభ్యర్థిగా ప్రకటించారని నేరుగా ప్రశ్నిస్తున్నారు. శుక్రవారమైతే కొందరు ప్రెస్‌మీట్ పెట్టి అటు అభ్యర్థిపైన, ఇటు టిక్కెట్ రావడానికి సహకరించిన పురంధేశ్వరిపై నేరుగా విమర్శలు ఎక్కుపెట్టారు. కులం కోసం పార్టీని తాకట్టు పెట్టేస్తారా అని ప్రశ్నిస్తున్నారు. నియోజకవర్గంలో ఈయన కోసం అందరికీ తెలుసని, రియల్ ఎస్టేట్‌తో ఏం చేశారో ప్రజలు చూశారని, అలాంటి వ్యక్తిని బీజేపీ అభ్యర్థిగా ప్రకటించి ఏకంగా బీసీలకు అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: ఎచ్చెర్ల బీజేపీ అభ్యర్థి నడికుదిటి ఈశ్వరరావు(ఎన్ఈఆర్) పై మిత్రపక్షంలోనే కాదు స్వపక్షంలోనూ వ్యతిరేకత వెల్లువెత్తుతోంది. రోజురోజుకీ అసమ్మతి పెల్లుబుకుతోంది. రియల్ ఎస్టేట్ వ్యాపారిని తీసుకొచ్చి తమపై రుద్దడమేంటని ఏకంగా బీజేపీ రాష్ట్ర నాయకత్వంపై మండిపడుతోంది. కులాభిమానంతో బీసీల నియోజకవర్గాన్ని కమ్మ సామాజిక వర్గ నేతకు కట్టబెట్టారని ఏకంగా పురంధేశ్వరిపైన అసమ్మతి నాయకులు ధ్వజమెత్తారు. కొత్తగా పార్టీలోకి చేరిన వ్యక్తికి టిక్కెట్ ఇస్తే 20, 30 ఏళ్లుగా పార్టీని నమ్ముకుని పని చేసిన బీజేపీ నాయకులంతా ఏమైపోవాలని ఏకంగా రాష్ట్ర అధ్యక్షురాలిని ప్రశ్నిస్తున్నారు. అంతా కలిసి బీసీలకు అన్యాయం చేశారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు జరుగుతున్న డ్యామేజ్ కంట్రోల్ చేసేందుకు ఎన్ఈఆర్ మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారు. అటు టీడీపీ నాయకులు చేస్తున్న సోషల్ మీడియా ప్రచారంపై చర్యలు తీసుకోలేక, స్వపక్షంలో వస్తున్న అసమ్మతిని చల్లార్చలేక జరిగిన పరిణామాలపై వార్తలు రాస్తున్న వారిపై అక్కసు వెళ్లగక్కుతున్నారు. ఆ వార్తలు ప్రచురిస్తున్న పత్రికలపై పరువు నష్టం దావా వేస్తామంటూ సోషల్ మీడియా వేదికగా బెదిరింపులకు దిగుతున్నారు.

టీడీపీ శ్రేణుల డైరెక్ట్ అటాక్..

ఇప్పటికే టీడీపీ కేడర్ రగిలిపోతుండగా, వారికి బీజేపీ నాయకులు కూడా తోడైనట్టు అయింది. టీడీపీ నాయకులైతే బహిరంగంగానే ఎన్ఈఆర్ అభ్యర్థిత్వంపై వ్యతిరేకతను చూపిస్తున్నారు. సోషల్ మీడియాలోనైతే ఓ ఆట ఆడేసుకుంటున్నారు. ఓ పంచాయతీకి పరిమితమైన నాయకుడ్ని ఎమ్మెల్యే అభ్యర్థిగా పెట్టారంటే అంతకన్న దిగజారుడు తనం లేదని బాహాటంగానే వ్యాఖ్యానిస్తున్నారు. కేవలం అసంతృప్తి వ్యక్తం చేయడమే కాకుండా ఎన్ఈఆర్ బాగోతమంతా బయటపెడుతున్నారు. ఆయనపై ఉన్న కేసులు, గతంలో చేసిన దాడులు, దళితులపై అనుసరించిన తీరు తదితర వివరాలన్నింటినీ సోషల్ మీడియా వేదికగా పంచుకుంటున్నారు. కేవలం టీడీపీ సోషల్ మీడియా ప్రచారంతోనే చాలా వరకు ఎన్ఈఆర్‌కు డ్యామేజ్ జరిగింది. అటు సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని, ఇటు టీడీపీ నాయకులు చేసిన వ్యాఖ్యలను, బీజేపీలో వ్యక్తమవుతున్న అసమ్మతిని పత్రికల్లో రాస్తుంటే వాటిపై దూకుడు చూపిస్తున్నారే తప్ప తనపై వ్యతిరేక ప్రచారం చేసిన వారి జోలికి పోవడం లేదు. వారితో పెట్టుకుంటే రానున్న ఎన్నికల్లో తనకు డుమ్మా కొట్టేస్తారేమోనని, టార్గెట్ చేసి నష్టం కలిగిస్తారేమోనని భయపడి వారినేమీ అనడం లేదు. జరుగుతున్న పరిణామాలపై వార్తలు రాసిన పత్రికలపై మాత్రం ప్రతాపం చూపిస్తామంటూ భయపెడుతున్నారు.

పొలిటికల్ స్పాట్ లైట్

ఉన్న మాట రాస్తే ఉలుకెందుకు..

గతంలో జరిగిన పరిణామాలు, వాస్తవ ఘటనలు, నమోదైన కేసులు, ఎన్ఈఆర్‌కు వ్యతిరేకంగా జరిగిన నిరసన కార్యక్రమాలన్నీ రికార్డయ్యి ఉన్నాయి. దళితులపై దాడులకు సంబంధించిన ఎస్సీ, ఎస్టీ ఎట్రాసిటీ కేసులు ఎన్ని నమోదయ్యాయో అందరికీ తెలుసు. 2014నుంచి 2019 వరకు ఎన్ని అరాచకాలకు పాల్పడ్డారో నియోజకవర్గ ప్రజలకు తెలుసు. అంతెందుకు తన కూటమిలోని టీడీపీ వారే ఆయన బాగోతమంతా బయటపెడుతున్నారు. అప్పట్లో జరిగిన దాడుల్లో గాయపడిన వారి వివరాలు, అప్పటి ఫొటోలు, వీడియోలు అన్నీ ఉన్నాయి. వీటన్నింటినీ మర్చిపోయి.. పత్రికలపై పరువు నష్టం దావా వేసి తగు చర్యలు తీసుకుంటామని సోషల్ మీడియా వేదికగానే ఎన్ఈఆర్ బెదిరింపులకు దిగుతున్నారు.

ఓటెత్తాలి..



2024 సమరం సన్నద్ధం

నరసన్నపేట: ఓట్ల పండగ వచ్చేస్తోంది. ఓటు హక్కు వినియోగించుకునే వారి సంఖ్యను పెంచడానికి కేంద్ర ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ఈవీఎంలలో మెజారిటీ ప్రజలు ఓటు వేస్తారు. ఈ పద్ధతిలోనే కాకుండా మరిన్ని పద్ధతుల్లో కూడా ఓటు వేసే వారు ఉన్నారు. ఆ వివరాల్లోకి వెళ్తే..

సాధారణ ఓటు

భారత రాజ్యాంగం 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కును కల్పించింది. ఇలా ఓటు హక్కును పొందిన వారు తమకు నచ్చిన నేతకు ఓటు వేసేందుకు అవకాశం ఉంది. తమ గ్రామాల్లో బూత్‌కు వెళ్లి మామూలుగా ఓటు వేస్తే దాన్ని సాధారణ ఓటు అంటారు.

పోస్టల్ బ్యాలెట్



ఎన్నికలు సజావుగా కొనసాగాలంటే చాలా మంది బాధ్యతలు పంచుకోవాల్సి ఉంటుంది. దీంట్లో ప్రధాన పాత్ర ప్రభుత్వ సిబ్బందిది. ఇలాంటి వారిలో అధికారులు, ఉద్యోగులు, జర్నలిస్టులు గ్రామాలకు, పట్టణాలకు వెళ్లి ఓటు హక్కును వినియోగించుకోలేరు. ఇలాంటి వారికి ఎన్నికల సంఘం పోస్టల్ బ్యాలెట్‌ను ప్రవేశపెట్టింది. దీని ద్వారా తమకు నచ్చిన వ్యక్తిని ఓటు వేసి ఎన్నికల అధికారులకు ముందుగానే పంపించవచ్చు.

సర్వీస్ ఓటు



దేశ రక్షణలో భాగంగా చాలా మంది సైనికులు, పారామిలటరీ ఉద్యోగులు స్వరాష్ట్రానికి వెళ్లి తమ నియోజకవర్గాల్లో ఓటు హక్కును వినియోగించుకోలేరు. తమకు నచ్చిన నాయకుడికి ఓటు వేసేందుకు వీలుగా ఎన్నికల సంఘం వీరికి వెసులుబాటు కల్పించింది. వీరిని సర్వీస్ ఓటర్లుగా గుర్తిస్తారు. ఆసక్తి ఉన్న వారు కోరుకుంటే వీరి కోసం ప్రత్యేకంగా సర్వీసు ఓటును కల్పిస్తుంది. వీరు సర్వీస్‌లో ఉన్న ప్రాంతం నుంచే ఓటు వేయవచ్చు.

టెండర్ ఓటు..



ఓటరు ఓటు వేయడానికి వచ్చే సరికి అతని ఓటు ఇంకెవరో వేసిన సందర్భాలుంటాయి. ఇలాంటి సందర్భాల్లో ఆ ఓటరు తాను ఓటు వేస్తానని పట్టు పట్టవచ్చు. ఆ ఓటరు వివరాలను ప్రిసైడింగ్ అధికారి పరిశీలించి.. వాస్తవంగా ఓటు ఆయన వేయలేదని నిర్ధారణకు వస్తే ఈవీఎం ద్వారా కాకుండా బ్యాలెట్ పేపరు ద్వారా ఓటుకు అవకాశం ఇస్తారు. దీన్నే టెండర్ ఓటు అంటారు. దీని కోసం ప్రతి పోలింగ్ కేంద్రంలో ఎమ్మెల్యే, ఎంపీలకు సంబంధించి 20 చొప్పున బ్యాలెట్ పేపర్లు అందుబాటులో ఉంచుతారు. ఓటు వేశాక కవర్లలో పెట్టి ప్రిసైడింగ్ అధికారికి అందజేస్తే దాని వెనుక టెండర్ బ్యాలెట్ అని రాస్తారు.

ప్రాక్సీ ఓటింగ్..



కేంద్ర నిఘా సంస్థలు, గూఢచారి సంస్థల సిబ్బంది తమ ఉనికిని మరెవరికి తెలియకుండా గోప్యంగా ఉంటారు. వారు తన ప్రతినిధిగా మరెవరినైనా పంపించి ఓటు వేయవచ్చు. ఈ విధమైన ఓటు హక్కునే ప్రాక్సీ ఓటు హక్కు అంటారు. వారు స్థానికంగా లేనందున ఓటు వేసేందుకు ఒక ప్రతినిధిని అధికారులు అనుమతిస్తారు. వీరి ని క్లాసిఫైడ్ సర్వీస్ ఓటరుగా గుర్తిస్తారు. నియోజకవర్గం, పోలింగ్ బూత్ పరిధిలోని ప్రాక్సీ ఓటరు వివరాలపై ఆర్ఓ ద్వారా ప్రొసీడింగ్ అధికారికి ముందే సమాచారం అందుతుంది. సర్వీసు ఓటరు తరపున వచ్చే ఓటరు ఆ పోలింగ్ కేంద్రంలో మిగతా ఓటరుగానే ఓటు వేస్తారు. ఇలాంటి ఓటరుకు మధ్య వేలికి సిరా చుక్క పెడతారు. అదే సర్వీసు ఓటరుకు అయితే కుడి చేతికి సిరా చుక్క పెడతారు. అయితే ప్రాక్సీ ఓటరు ఒకరి తరపున మాత్రమే ఈ విధంగా ఓటు వేసేందుకు అవకాశం ఉంటుంది.

'ఎన్ఈఆర్‌కు ఎలా సీటిస్తారు..?'



విలేకరులు సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల నియోజక వర్గంలో 75 శాతం ప్రజలు బీసీ సామాజిక వర్గం వారు ఉండగా, నియోజక వర్గంలో 400 ఓట్లు లేని కమ్మ సామాజిక వర్గం (ఓసీ)కి ఎమ్మె ల్యే టిక్కెట్ ఎలా కేటాయిస్తారని బీజేపీ విజయనగరం పార్లమెంటరీ ఉపాధ్యక్షు డు దేవర ఈశ్వరరావు ప్రశ్నించారు. చిలకపాలెంలో ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. తన ఆస్తులను రక్షించుకునేందుకే ఈశ్వరరావు టీడీపీ నుంచి బీజేపీలో చేరారని అన్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరి వర్గానికి చెందిన వారు కావడం వల్లనే ఎన్ఈఆర్‌కు టికెట్ వచ్చిందన్నారు. ఈ వ్యక్తి గెలిచే అవకాశమే లేదని కుండ బద్దలుగొట్టారు. పార్టీ ప్రయోజనాల కంటే కుల ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వడం దురదృష్టకరమన్నారు. కనీసం సీటు ఎంపికలో సీనియర్ల సలహాలు కూడా తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సీనియర్ నాయకులు సువ్వారి సన్యాసిరా వు మాట్లాడుతూ 25 ఏళ్ల నుంచి పార్టీకి సేవ చేస్తున్న వారిని కనీసం సంప్రదించకుండా సీట్లు కుటాయించారని, సీటు ఎంపికే బీజేపీ ఓటమిని ఖరారు చేసిందని అన్నారు. ఎన్ఈఆర్ ఓటమికి సీనియర్ బీజేపీ నాయకులు కృషిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తీగెల హరనాథ్, వర్రి వెంకటనారాయణ, తండినాడు అప్పలాచారి, దుక్క ఆదినారాయణ పాల్గొన్నారు.



'పాతపట్నంలో టీడీపీ ఓటమి ఖాయం'



చాపర గ్రామంలో మాట్లాడుతున్న కలమట వెంకటరమణ

మెళియాపుట్టి: పాతపట్నం మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ ఐదు మండలాల టీడీపీ నాయకులు, కార్యకర్తలతో శుక్రవారం మెళియాపుట్టి నుంచి చాపర వరకు సంఘీభావ యాత్ర నిర్వహించారు. చంద్రబాబు పునరాలోచించి పాతపట్నం టికెట్ తనకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఇక్కడ టీడీపీ ఓటమి ఖాయమని అన్నారు. నియోజకవర్గంలోని టీడీపీ శ్రేణులతో బలనిరూపణ చేసే ప్రయత్నం చేశారు. అయితే పార్టీ చివరి జాబితా సైతం విడుదల కావడంతో కలమట టికెట్‌పై ఆశలు వదులుకోవాల్సిందేనని స్పష్టమైంది.

ఆలోచింపచేసిన నాటికలు



మూల్యం నాటికలో ఓ సన్నివేశం

శ్రీకాకుళం కల్చరల్: సుమిత్రా కళాసమితి ఆధ్వర్యంలో రెండో రోజు బాపూజీ కళామందిర్‌లో ప్రదర్శించిన రెండు నాటికలను ప్రేక్షకులను ఆలోచింపచేశాయి. గోవాడా క్రియేషన్స్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో 'మూల్యం' నాటిక చక్కగా ప్రదర్శించారు. నేటి సమాజంలో స్త్రీకి గల వివక్షతకు వ్యతిరేకంగా ఒక వివాహిత తన హక్కును నిరూపించుకుని సాధించిన కథాంశంతో చక్కగా సాగింది. ఈ నాటికకు కథను సింహప్రసాద్ అందించగా దర్శకత్వం డాక్టర్ వెంకట్ గోవాడ అందించారు. కాకినాడ, తిరుపతికి చెందిన శ్రీశృంగార వల్లభ ఆర్ట్స్ వారి 'కబ్జా' నాటికలో బలహీనుడు దోపిడీకి గురవుతున్నాడని దానితోపాటు న్యాయం, చట్టం, ధర్మ, మానవీయ కోణాలు సైతం కబ్జాకు గురవుతున్నాయని తెలిపే ఇతి వృత్తంతో ఈ నాటిక ప్రదర్శన సాగింది. దీనికి దర్శకత్వం కోరుకొండ బ్రహ్మానందం వహించగా, రచన కొంతం కాశీవిశ్వనాథం చేశారు. శనివారం ఇంద్రప్రస్థం, పక్కింటి మొగుడు నాటికల ప్రదర్శన ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

● 'నేడు, రేపు బ్యాంక్‌లు పనిచేస్తాయి'

శ్రీకాకుళం అర్బన్: జిల్లాలోని అన్ని ప్రభుత్వ రంగ బ్యాంక్‌లు శనివారం, ఆదివారాల్లో పనిచేయనున్నాయి. ఆర్థిక సంవత్సరం ముగింపు కారణంగా రిజర్వ్ బ్యాంక్ ఆదేశాల మేరకు శనివారం, ఆదివారాల్లో ఏవైనా ప్రభుత్వ కార్యాకలాపాలు, లావాదేవీలు ఉంటే అవి యథావిధిగా కొనసాగుతాయని బ్యాంక్ అధికారులు తెలిపారు. ఈ రెండు రోజులు వినియోగదారులు తమ ఆర్థిక లావాదేవీలను యథావిధిగా కొనసాగించుకోవచ్చని ఎల్‌డీఎం సూర్యకిరణ్ తెలిపారు.



● వైభవంగా శ్రీనివాసుని చక్రతీర్థ స్నానం

స్థానిక హరిదాసు కోనేరులో శుక్రవారం శ్రీనివాసుని చక్రతీర్థ స్నానాలు కన్నులపండువగా జరిగాయి. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా స్వామి విగ్రహాలకు ముందుగా తిరువీధి నిర్వహించారు. అనంతరం హరిదాసు కోనేరు వద్ద ఆలయ ప్రధానార్చకులు చామర్తి కృష్ణమాచార్యులు ప్రత్యేక అభిషేకార్చనలు, చక్రతీర్థ స్నానాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంతకవిటికి చెందిన ప్రముఖ ప్రవచన కర్త యాలాల శ్రీనివాసరావు అనుగ్రహ భాషణం చేశారు. -కొత్తూరు



క్లుప్తంగా

చిన్న పిల్లల వైద్యంపై ప్రాథమిక అవగాహన ఉండాలి


టెక్కలిలో ఈఎంటీ సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న జిల్లా మేనేజర్

టెక్కలి: 108 వాహనాల్లో పనిచేస్తున్న సిబ్బందికి అత్యవసర సమయాల్లో చిన్న పిల్లల వైద్యంపై ప్రాథమికంగా అవగాహన ఉండాలని ఏఈఎంఎస్ జిల్లా మేనేజర్ హరిప్రసాద్ సూచించారు. టెక్కలి జిల్లా ఆస్పత్రిలో డివిజన్ స్థాయిలో ఈఎంటీలకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అత్యవసర సమయాల్లో వివిధ వైద్య సేవలపై ప్రాథమికంగా అవగాహన పెంచుకోవాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వివిధ రకాల వైద్య సేవలపై వివరించారు. కార్యక్రమంలో రంగప్రసాద్, ఎన్.కృష్ణారావుతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

మార్కెటింగ్‌పై మహిళలకు అవగాహన


ఆహార పదార్థాల తయారీ మిషన్ గురించి వివరిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల: చిరుధాన్యాలతో ఆహార పదార్థాలు తయారు చేసి మార్కెటింగ్ చేయడంపై మహిళలకు శుక్రవారం విశాఖపట్నంలోని ఎస్‌వీడీఎస్ స్వచ్ఛంద సంస్థ (విశాఖపట్నం) వారు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ గ్రామీణాభివృద్ధి బ్యాంక్ (నాబార్డు) ప్రాంతీయ కార్యాలయం అమరావతి ఆర్థిక సహకారంతో యూత్‌క్లబ్ బెజ్జిపురం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో లావేరు మండలం తాళ్లవలస గ్రామంలో చిరుధాన్యాలతో ఆహార పదార్థాల తయారీపై శిక్షణ ఇస్తున్నారు. కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసిన మహిళలు విజ్ఞాన యాత్ర నిమిత్తం విశాఖ జిల్లా, పాడేరు మండలం, సంతబాయలలో ఎస్‌వీడీఎస్ స్వచ్ఛంద సంస్థ నిర్వహిస్తున్న సుశాగ్ మిల్లెట్స్ (ఎఫ్‌పీఓ)ను సందర్శించారు. చిరుధాన్యాలతో ఆహార పదార్థాలు తయారుచేస్తూ, మార్కెటింగ్‌లో వారి అనుభవాలను తెలుసుకొనేందుకు సుశాగ్ మిల్లెట్స్ ఎఫ్‌పీఓను సందర్శించినట్లు యూత్ క్లబ్ ప్రతినిధి ఎల్.దుర్గారావు తెలిపారు. కార్యక్రమంలో 30 మంది ఎస్‌హెచ్‌జీ మహిళలు, సుశాగ్ మిల్లెట్స్ ఎఫ్‌పీఓ ముఖ్య కార్యనిర్వహణాధికారి టి.శాంతకుమారి, చైర్మన్ ఎం.విజయ, ఎస్‌డీవీఎస్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు జోగినాయుడు, యూత్‌క్లబ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైవీ సుబ్బారెడ్డికి ఘన సన్మానం


వైవీ సుబ్బారెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉత్తరాంధ్ర జిల్లాల సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డిని శుక్రవారం ఓ ప్రైవేటు హోటల్‌లో ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు కలిసి సత్కరించారు. సుబ్బారెడ్డిని సాదరంగా ఆహ్వానించి దుశ్శాలువ, గజమాలతో సత్కరించారు. సుబ్బారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించేందుకు సమన్వయంతో కలిసి పనిచేయాలన్నారు. జిల్లాలో ఎనిమిది స్థానాలకు ఎనిమిది స్థానాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించి వైఎస్ జగన్‌ను బహుమతిగా అందజేయాలన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై కేసు నమోదు

సారవకోట: మండలంలోని మూగుపురం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు చౌదరి లక్ష్మీనారాయణ ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని అందిన ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ అప్పారావు తెలిపారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై వచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేసి ఉన్నతాధికారుల సూచన మేరకు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎంపీడీఓ తెలిపారు.


కంచిలి: పురుషోత్తపురంలో ఉపాధి హామీ వేతనదారుల మధ్య గిడుగు ధరించి కూర్చొని మాట్లాడుతున్న ఇచ్ఛాపురం ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ


నరసన్నపేట: ఫ్యాను గుర్తుపై ఓటు వేయాలని తామరాపల్లిలో ఒక మహిళకు సూచిస్తున్న ధర్మాన పద్మప్రియ


రణస్థలం: కొచ్చెర్ల ప్రచారంలో వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎచ్చెర్ల ఎమ్మెల్యే కిరణ్‌కుమార్ భార్య పరిమళ


హిరమండలం: కిట్టలపాడులో ప్రచారం నిర్వహిస్తున్న పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి కుమారుడు ఓంశ్రీకృష్ణ, నాయకులు


సంతబొమ్మాళి: ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

● అన్ని వర్గాలతో..

చేసిన పనులను చెబుతూ, చేయబోయే కార్యాలను వివరిస్తూ నాయకులు జనంలోకి వెళ్తున్నారు. ఐదేళ్ల పనితీరును ప్రజల ముందు ఉంచుతూ రానున్న ఐదేళ్లకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. అన్ని వర్గాల వారిని పలకరిస్తూ ఆశీర్వదించాలని కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో మాజీ సర్పంచ్ మృతి


బుక్క జనార్దన్ (ఫైల్)

ఎల్.ఎన్.పేట: మండలంలోని కరకల వలస మాజీ సర్పంచ్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, లక్ష్మీనర్సుపేట పీఏసీఎస్ డైరెక్టర్ బుక్క జనార్దన (68) రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందారు. మండలంలోని కుశమలపాడు గ్రామానికి చెందిన జనార్దన గురువారం తన సమీప బంధువుల ఇంటిలో జరిగిన శుభ కార్యానికి వెళ్లారు. తిరిగి తన స్వగ్రామానికి వచ్చే క్రమంలో తురకపేట సెంటర్ వద్ద తురకపేట రోడ్డు నుంచి ట్రాక్టర్‌ను తప్పించే క్రమంలో అదుపు తప్పి కిందకు పడిపోయారు. దీంతో ఆయన తలకు బలమైన గాయమైంది. వెంటనే శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందారని కుటుంబ సభ్యులు తెలిపారు. జనార్దన మృతికి పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి తనయుడు రెడ్డి శ్రావణ్, ఎల్.ఎన్.పేట ఎంపీపీ రెడ్డి జ్యోతిలక్ష్మి, జెడ్పీటీసీ కిలారి త్రినాథులు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పెనుమజ్జి విష్ణుమూర్తి, పీఏసీఎస్ అధ్యక్షులు కొల్ల కృష్ణ తదితరులు సంతాపం తెలిపారు.

పెళ్లి కబురు చెప్పడానికి వెళ్తూ..

- బైక్ ప్రమాదంలో వలంటీర్ మృతి
- 20 రోజుల్లో పెళ్లి ఉందనగా దుర్ఘటన


కణుతూరు షణ్ముఖరావు (ఫైల్)

పాతపట్నం: మండలంలోని చిన్నమల్లిపురం పంచాయతీ కొయ్యకొండ గ్రామానికి చెందిన వలంటీర్ కణుతూరు షణ్ముఖరావు(37) శుక్రవారం ఓ రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. ఏప్రిల్ 20న షణ్ముఖరావుకు పెళ్లి జరగాల్సి ఉంది. ఆ పెళ్లి కబుర్లు చెప్పడానికి వెళ్తూ ఆయన కన్నుమూశారు. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. షణ్ముఖరావు తన పెళ్లి కబుర్లు చెప్పడానికి శుక్రవారం రాజాం మండలం అమరాం గ్రామానికి వెళ్లాడు. మధ్యాహ్నం భోజనం చేసి పాలకొండ మీదుగా ఇంటికి బైక్‌పై బయల్దేరాడు. రేగిడి మండలం కుమ్మరి అగ్రహారం వచ్చేసరికి ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి ఆటోను ఢీకొట్టాడు. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని రాజాం సామాజిక ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి గ్రామస్తులకు సమాచారం అందడంతో ఇక్కడ విషాద ఛాయలు అలముకున్నాయి. షణ్ముఖరావు తండ్రి చిన్నప్పుడే మృతి చెందడంతో తల్లి రాజులమ్మ పెంచి పెద్దచేసింది. మరో 20 రోజుల్లో పెళ్లి జరగాల్సి ఉందనగా ఇలా జరగడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం


హేమావతి (ఫైల్)

వజ్రపుకొత్తూరు రూరల్: ధర్మపురం చెరువు వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అక్కుపల్లి గ్రామానికి చెందిన మడ్డు హేమావతి(34) మృతి చెందారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మృతురాలు అదే గ్రామానికి చెందిన ఆర్జల నాగమణితో కలిసి స్కూటీపై కాశీబుగ్గ నుంచి స్వగ్రామానికి బయల్దేరారు. ధర్మపురం చెరువు వద్ద అదే గ్రామానికి చెందిన యువకులు అజయ్, హృదయ్‌లు గరుడబద్ర నుంచి కాశీబుగ్గ వైపు బైక్‌పై వస్తుండగా చెరువు వద్ద రెండు బైక్‌లు ఢీకొట్టుకున్నాయి. ఈ ప్రమాదంలో నలుగురు గాయాలపాలయ్యారు. వెంటనే క్షతగాత్రులను 108 వాహనంలో పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మడ్డు హేమావతి పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కో సం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతిరాలి భర్త న వీన్ వలస కూలీగా దుబాయ్‌లో ఉన్నారు. ఇద్ద రు కుమారులు ఉన్నారు. ఆమె మృతితో గ్రా మంలో విషాదఛాయలు అలముకున్నాయి. కాగా ఈ సంఘటనపై స్థానిక ఎస్‌ఐ సీహెచ్ రామారావు కేసు నమోదు చేశారు.

అభివృద్ధి చేశా.. ఆశీర్వదించండి

పలాస నియోజకవర్గంలో అరవై ఏళ్ల కాలంలో జరగని పనులు ఐదేళ్ల కాలంలో చేసి చూపించామని రాష్ట్ర పశు సంవర్థక పాడి పరిశ్రమల మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. కిడ్నీ ఆస్పత్రి, కొత్త రోడ్లు, పలాసకు ప్రభుత్వ డిగ్రీ కాలేజీ వంటి ఎన్నో స్వప్నాలు తన హయాంలో నెరవేరాయని తెలిపారు. మరోసారి అసెంబ్లీకి పంపిస్తే ఇంకా మరెన్నో పనులు చేస్తానని చెప్పారు. నియోజకవర్గ ప్రజలు ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. ఆయన శుక్రవారం మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో మనసు విప్పి మాట్లాడారు. – కాశీబుగ్గ


మీట్ ది ప్రెస్‌లో మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

ప్రశ్న: వైఎస్ కుటుంబానికి పలాస ఎందుకంత ప్రత్యేకం?

మంత్రి: పలాస–కాశీబుగ్గ జంట పట్టణాల అభివృద్ధిలో వైఎస్సార్, వైఎస్ జగన్‌లు కీలక పాత్ర పోషించారు. పలాసను నియోజకవర్గ కేంద్రంగా మార్చిన ఘనత వైఎస్సార్‌ది అయితే, పలాస–కాశీబుగ్గను రెవెన్యూ డివిజన్ కేంద్రంగా మార్చిన ఘనత వైఎస్ జగన్‌ది. ఇక్కడ తొలి మున్సిపల్ బాడీని కూడా వైఎస్సార్ గెలిచారు. అప్పుడే రూ.2 కోట్లతో మున్సిపల్ కార్యాలయం, జంటపట్టణాల విస్తరణ, రెండువైపులా కాలువల ఏర్పాటు, మున్సిపాలిటీలో రెండు అతి పెద్దషాపింగ్ కాంప్లెక్సులు, పెద్ద బస్టాండ్, రెండు ఫిష్‌మార్కెట్‌లు, రెండు ఈసేవా భవనాలు, సీసీ రోడ్లు, కాలువలు, అతిపెద్ద చెత్తసేకరణ కేంద్రం ఏర్పాటు చేశారు.

ప్రశ్న: వైఎస్ జగన్ హయాంలో పలాసలో జరిగిన పనులేంటి?

మంత్రి: ఇక్కడ నేను ఎమ్మెల్యేగా ఎన్నికైన అనంతరం సీఎం వైఎస్ జగన్ దీవెనలతో దాదాపు రూ.2వేల కోట్ల విలువైన పనులు చేశాం. కొన్ని పూర్తయ్యాయి.. ఇంకొన్ని నిర్మాణ దశలో ఉన్నాయి. రూ.700 కోట్లతో శుద్ధజలం ప్రాజెక్టు, రూ.860 కోట్లతో ఆఫ్‌షోర్ ప్రాజెక్ట్, రూ.100.09 కోట్లతో పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీకి అర్బన్ వాటర్ స్కీంతో ఇంటింటికీ తాగునీటికి శంకుస్థాపన, రూ.85 కోట్లతో కిడ్నీ ఆస్పత్రి, మంచినీళ్లపేటలో రూ12.5 కోట్లతో జెట్టీ వంటి పనులన్నీ ఇప్పుడే జరిగాయి.

ప్రశ్న: పలాస యువతరానికి ఏమి చేశారు..?

మంత్రి: అరవై ఏళ్లుగా స్థానిక ప్రజలు అడుగుతున్న డిగ్రీ కాలేజీని మంజూరుచేశాం. హరిపురం, వజ్రపుకొత్తూరు, బ్రాహ్మణతర్లాకు మహిళా ఇంటర్ కళాశాలలు మంజూరు చేశాం. కాశీబుగ్గ హైస్కూల్‌ను స్టేట్ సిలబస్ నుంచి సీబీఎస్‌సీకి మార్చాం. మండలానికి రెండు చొప్పున ఆరు డిజిటల్ లైబ్రరీలకు స్థల పరిశీలన పూర్తయ్యింది. రూ.32 లక్షలతో రెండు ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేశాం.

ప్రశ్న: సామాన్యులకు ఎలాంటి మేలు జరిగింది?

మంత్రి: జంట పట్టణాల్లో 2555 ఇళ్లతో అతి పెద్ద జగనన్న కాలనీ 49 ఎకరాల్లో ఏర్పాటు చేశాం. టిడ్కో ఇళ్లను కూడా పంపిణీ చేశాం. మున్సిపాలిటీలో మూడు యూపీహెచ్‌ఎస్‌లు ప్రారంభించాం. హరిపురంలో నూతన డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేసి బెడ్‌లు పెంచాం. సచివాలయాలు, ఆర్‌బీకేలు, వైఎస్సార్ క్లినిక్‌లు కట్టాం.

ప్రశ్న: నియోజకవర్గంలో రోడ్ల పరిస్థితి?

మంత్రి: నియోజకవర్గంలో అతి పెద్ద ముఖ్యమైన బీటీ రోడ్లు రూ.21 కోట్లుతో కాశీబుగ్గ–వజ్రపుకొత్తూరు(19 కిలోమీటర్లు), రూ.19 కోట్లతో టెక్కలిపట్నం–నువ్వలరేవు, ఏఎంసీ నిధులు రూ.9 కోట్లతో వంతెనలు, రూ.18 కోట్లతో కాశీబుగ్గ రైల్వే ఫ్లై ఓవర్ పునఃనిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. మందస మండల కేంద్రంతో పాటు గిరిజన గ్రామాల్లో సీసీ రోడ్లు వేశాం. పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ విస్తరణ, డ్రైన్, ఫుట్‌పాత్‌ను రూ.4 కోట్లుతో సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దాం. విపక్షాలు ఈ రోడ్లను చూడాలి.

ప్రశ్న: ఇక్కడ పారిశ్రామిక అభివృద్ధి జరిగిందా?

మంత్రి: నాలుగు వేల ఎకరాల్లో పోర్టు నిర్మాణం జరుగుతోంది. పలాస జీడి పరిశ్రమలకు 2014 నుంచి రావాల్సిన ప్రోత్సాహకాలు రూ.120 కోట్లు 2020 ఏప్రిల్, మే నెలల్లో విడుదల చేశారు. 64 ఎకరాల్లో నూతన పారిశ్రామిక వాడ వస్తోంది. పోర్టు, జాతీయ రహదారి, రైల్వే స్టేషన్‌లు, పవర్‌గ్రిడ్ అన్ని సౌకర్యాలతో ఉపాధి కేంద్రంగా మారబోతోంది.

రైలు ఢీకొని మహిళ మృతి


మృతి చెందిన గుర్తు తెలియని మహిళ

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం ఎల్‌సీ గేట్ సమీపంలో రైలు ఢీకొట్టడంతో గుర్తుతెలియని మహిళ మృతి చెందారు. జీఆర్పీ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఎల్‌సీ గేట్ సమీపంలో గల చిదంబరేశ్వర దేవాలయం వద్ద అప్‌లైన్ ట్రాక్ వద్ద శుక్రవారం ఓ మహిళ మృతదేహం కనిపించింది. ఆమె వయసు 50 ఏళ్లు ఉంటుందని, తెల్లని ఛాయ కలిగి ఎరుపు, పచ్చని రంగు డిజైన్ గల చీరను, నీలం రంగు జాకెట్ ధరించి ఉందన్నారు. మృతురాలు ట్రాక్ దాటే క్రమంలో రైలు ప్రమాదం జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు. స్థానిక రైల్వేస్టేషన్ సిబ్బంది ఇచ్చిన సమాచారంతో జీఆర్‌పీలు సంఘటనా స్థలానికి వచ్చి వివరాలు సేకరించి మృతదేహాన్ని పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

పది స్పాట్‌కు వేళాయె

- రేపటి నుంచి టెన్త్ మూల్యాంకనం మొదలు
- శ్రీకాకుళం ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో శరవేగంగా సాగుతున్న కోడింగ్ ప్రక్రియ
- జిల్లాకు చేరుకున్న 1.85 లక్షల జవాబుపత్రాలు

శ్రీకాకుళం న్యూకాలనీ: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు–2024 జవాబుపత్రాల మూల్యాంకన ప్రక్రియకు సర్వం సిద్ధమైంది. జిల్లాలో ఏప్రిల్ ఒకటి నుంచి మొదలయ్యే మూల్యాంకనానికి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. రాష్ట్రప్రభుత్వ ఆదేశాల మేరకు ఎనిమిది రోజుల్లో స్పాట్‌ను పూర్తిచేసేలా జిల్లా యంత్రాంగం పక్కాగా సన్నద్ధమైంది. తాగునీరు, ఫర్నీచర్, లైటింగ్, ఫ్యాన్లు, ఇతర మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటున్నారు. మొత్తం 7 పేపర్లకు సంబంధించి 24 పేజీల బుక్‌లెట్స్‌తో కూడిన 1.80లక్షల పేపర్లు జిల్లాకు చేరుకున్నాయి. కోడింగ్ ప్రక్రియ శరవేగంగా సాగుతోంది. తెలుగుమీడియం, ఇంగ్లిష్ మీడియం, ఒరియా మీడియం జవాబుపత్రాలు దిద్దుబాటు జరగనుంది.

రెండు కేంద్రాల్లో స్పాట్..

జిల్లాలో రెండు కేంద్రాలుగా స్పాట్ వాల్యుయేషన్ కొనసాగనుంది. శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలతోపాటు సమీపంలోనే మహాలక్ష్మినగర్ కాలనీలో ఉన్న శ్రీచైతన్య స్కూల్ కేంద్రాలుగా మూల్యాంకనం నిర్వహించనున్నారు. జిల్లాకు క్యాంప్ ఆఫీసర్‌గా డీఈఓ కె.వెంకటేశ్వరరావు నేతృత్వంలో స్ట్రాంగ్ రూమ్ డిప్యూటీ క్యాంప్ ఆఫీసర్/అసిస్టెంట్ కమిషనర్ లియాఖత్ ఆలీఖాన్ ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. ఈ రెండు కేంద్రాలకు ఇద్దరు డిప్యూటీ క్యాంప్ ఆఫీసర్లుగా ఉప విద్యాశాఖాధికారులు ఆర్.విజయకుమారి(శ్రీకాకుళం), నక్క రామకృష్ణ(టెక్కలి) వ్యవహరించనున్నారు. అలాగే అసిస్టెంట్ క్యాంపు ఆఫీసర్ల(వాల్యుయేషన్)గా మరో 7 మంది సీనియర్ హెచ్‌ఎంలను నియమించారు.


స్ట్రాంగ్ రూమ్ కమ్ మొదటి స్పాట్ కేంద్రం శ్రీకాకుళం ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల

స్పాట్‌లో 1210 మంది టీచర్లు..

టెన్త్ స్పాట్‌కు సంబంధించి వివిధ సబ్జెక్టులకు మొత్తం 186 గ్రూప్స్/బోర్డులను ఏర్పాటు చేయనున్నారు. ఒక బోర్డులో చీఫ్ ఎగ్జామినర్(సీఈ), ఇద్దరు స్పెషల్ అసిస్టెంట్లు, మరో ఆరుగురు అసిస్టెంట్ ఎగ్జామినర్లు (ఏఈలు) కలిపి మొత్తం 9 మంది ఉంటారు. మొత్తంమీద 1210 మంది టీచర్లు స్పాట్ ప్రక్రియలో భాగస్వామ్యమవుతారు. వీరంతా పదో తరగతి పాఠాలు బోధించిన/బోధిస్తున్న సబ్జెక్టు టీచర్లు. ఇందులో కొంతమంది ఎస్జీటీలు కూడా ఉన్నారు.

రోజుకు 40 పేపర్లు దిద్దుబాటు..

మూల్యాంకనంలో సబ్జెక్టు టీచర్లు పూటకు 20 పేపర్ల చొప్పున రోజుకు 40 పేపర్లను దిద్దనున్నారు. దిద్దుబాటుకు ఒక పేపర్‌కు రూ.10 చొప్పున 40 పేపర్లకు రూ.400 కేటాయిస్తారు. అలాగే డీఏగా సుదూర ప్రాంతాల పాఠశాలల నుంచి హాజరయ్యే ఉపాధ్యాయులకు అవుట్‌స్టేషన్ అలవెన్స్‌గా రూ.400 చెల్లిస్తారు. అలాగే స్పెషల్ అసిస్టెంట్లకు రోజుకు రూ.300 చొప్పున చెల్లిస్తారు. స్పాట్‌లో అలసత్వంతో వ్యవహరించి తప్పులు చేస్తే అందుకు మూల్యం చెల్లించుకోక తప్పదు. శాఖాపరమైన చర్యలు కూడా ఉంటాయి. ఇందుకు సంబంధించి విద్యాశాఖ ఎగ్జామినేషన్స్ డైరెక్టర్ మార్గదర్శకాలు జారీ చేశారు. సెల్‌ఫోన్ల అనుమతిని నిరాకరించనున్నారు. ఐడీ/గుర్తింపు కార్డు తప్పనిసరి. జవాబుపత్రాలను దిద్దుబాటు చేసే అన్ని గదుల్లో సీసీ కెమెరాలను అమర్చుతున్నారు. అధికారులు పర్యవేక్షించనున్నారు.

అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాం..



జిల్లాలో ఏప్రిల్ 1 నుంచి మొదలయ్యే టెన్త్‌క్లాస్ జవాబుపత్రాల మూల్యాంకనానికి అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాం. రెండు కేంద్రాల్లో ఈ ప్రక్రియను చేపట్టేందుకు చర్యలు తీసుకున్నాం. అందుకు వసరమైన సిబ్బందిని నియమించాం. విద్యాశాఖ కమిషనర్ ఆదేశాలు, జిల్లా కలెక్టర్ సూచనల మేరకు అధికారులు, ఎగ్జామినర్లు, సిబ్బందికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ఫర్నీచర్, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నాం. – కె.వెంకటేశ్వరరావు, జిల్లా విద్యాశాఖాధికారి/స్పాట్ క్యాంప్ ఆఫీసర్, శ్రీకాకుళం


రెండో మూల్యాంకన కేంద్రం శ్రీచైతన్య స్కూల్

8 రోజుల్లో పూర్తిచేసేలా..

ఎనిమిది రోజుల్లో స్పాట్‌ను పూర్తిచేసేలా జిల్లా విద్యాశాఖ అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నారు. గత రెండేళ్లుగా మూల్యాంకనాన్ని త్వరితగతిన పూర్తిచేసిన జిల్లాగా శ్రీకాకుళం జిల్లా రాష్ట్రంలో మొదటిస్థానంలో నిలిచిన విషయం తెలిసిందే. విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్, సమగ్రశిక్ష ఎస్పీడీ, ఆర్జేడీ సైతం జిల్లా అధికారులను ప్రశంసించారు. మళ్లీ అదే సీన్ రిపీట్‌చేసేలా డీఈఓ నేతృత్వంలో అసిస్టెంట్ కమిషనర్ లియాఖత్ ఆలీఖాన్, ఇతర అధికారులు, డీఈఓ కార్యాలయ సిబ్బంది ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తున్నారు.

బండి కాదది.. నా నేస్తమండీ

స్థలం శ్రీకాకుళంలోని పాత వంతెన. సమయం శుక్రవారం ఉదయం పది గంటలు. గాయాలతో దీనస్థితిలో ఉన్న కంటా రామారావు అనే రిక్షావాడు. కొందరు పోలీసులు. ఓ పాడైపోయిన రిక్షా. పోలీసులు పాడైపోయిన రిక్షాను తీసుకెళ్తుంటే ఆయన సొంత బిడ్డను తీసుకెళ్తున్నంతగా బాధపడ్డారు. నా రిక్షా జాగ్రత్త.. నా రిక్షా జాగ్రత్త.. అంటూ పోలీసులను వేడుకున్నారు. కరోనా కాలం నుంచి ఆ రిక్షానే రామారావుకు అన్నీ. పొద్దంతా కష్టపడేది. రాత్రయ్యాక పడుకునేది. తెల్లార్లూ కబుర్లు చెప్పుకునేది ఆ బండితోనే. నాలుగు రోజుల కిందట జరిగిన ప్రమాదంలో రిక్షా నుజ్జునుజ్జయిపోయింది. ఆయనకూ గాయాలయ్యాయి. తనకైన గాయాలకు ఎంత బాధ పడ్డాడో గానీ రిక్షా పాడైపోవడంతో కుమిలిపోయారు. రోడ్డు ప్రమాదం జరిగాక పోలీసులే ఆయనను గుర్తించి చేరదీసి శుక్రవారం ఓ చోటకు చేర్చారు. కుటుంబ సభ్యులపై కోపంతో కోవిడ్ సమయానికి ముందు రామారావు ఇల్లు వదిలేసి వచ్చేశారు. మొదట్లో ఓ అద్దె ఇంటిలో ఉండడం, ఆనక అద్దె కట్టలేక రోడ్డున పడడం, దాతల దయపై ఆధారపడి బతుకుతూ వంతెన నీడన రిక్షాలో సేద తీరడం ఆయనకు అలవాటైపోయింది. కష్టానికి అలవాటు పడిపోయారు గానీ పంతం వదిలి కుటుంబానికి దగ్గర కాలేకపోయారు. ఇప్పటికీ ఆయన కుటుంబం వాంబే కాలనీలో నివసిస్తోంది. కుమార్తె కలెక్టరేట్‌లో పనిచేస్తోంది. కానీ మూడేళ్లుగా రిక్షాలోనే నివాసం ఉంటూ.. ఆ బండితోనే నేస్తరికం కట్టిన రామారావు తన బండిని బాగు చేసి ఇస్తే అందులోనే ఉంటానని పోలీసులకు చెప్పడం గమనార్హం. భార్య, కూతురు పిలిచినా వెళ్లిపోతానని కూడా అన్నారు. – శ్రీకాకుళం క్రైమ్


నా గూడు పోయిందంటూ.. చూపిస్తోన్న వృద్ధుడు


గాయాలతో ఉన్న వృద్ధుడిని లేపుతున్న ట్రాఫిక్ సీఐ అవతారం, కానిస్టేబుల్ రామారావు


రిక్షాను తీసుకెళ్తున్న దృశ్యం